# పారదర్శకంగా మద్యం షాపుల కేటాయింపు

కరీంనగర్ కలెక్టర్ గోపి

7 లో







మనం
కరీంనగర్
జగిత్యాల- రాజన్న సిరిసిల్ల- పెద్దపల్లి -మంచిర్యాల- కొమురంభీమ్
మంగళవారం | 22 | ఆగస్టు | 2023 | పేజీలు : 7


## బిఆర్ఎస్ దళాన్ని ప్రకటించిన

# గులాబీ బాస్

ఉమ్మడి జిల్లా బరిలో ముగ్గురు కొత్త ముఖాలు

పదిమంది పాతవారికే ప్రాధాన్యత



కరీంనగర్ బ్యూరో, ఆగస్టు 21 (మనం న్యూస్): రాబోయే ఎన్నికల బరిలో నిలిచే అధికార బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను ఆ పార్టీ అధ్యక్షులు, సిఎం కెసిఆర్ సోమవారం ప్రకటించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని మొత్తం 13 అసెంబ్లీ స్థానాల్లో పది మంది పాతకాపులకే తిరిగి అవకాశమిస్తూ, కొత్తగా ముగ్గురికి చోటు కల్పించారు. వేములవాడ అసెంబ్లీ స్థానం నుంచి ఇప్పటి వరకు చెన్నమనేని రమేష్‌బాబు ప్రాతినిధ్యం వహిస్తుండగా, ఈ సారి ఈ స్థానంలో పోటీ చేసే అవకాశం చలిమెడ లక్ష్మీనరసిం హారావుకు కల్పించారు. అదే విధంగా హుజురాబాద్ శాసనసభ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డిని మిగతా 2లో..

## లక్కీ డ్రా ద్వారా 27 వైన్ షాపుల కేటాయింపు

### కలెక్టర్ హేమంత్ సహదేవరావు

కొమురంభీం ఆసిఫాబాద్, ఆగస్టు 21 (మనం న్యూస్): జిల్లాలో లక్కీ డ్రా ద్వారా 27 వైన్ షాపులను కేటాయించినట్లు కలెక్టర్ బొర్కడే హేమంత్ సహదేవరావు తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో ఉమ్మడి జిల్లా డిప్యూటీ కమిషనర్ నరసింహారెడ్డితో కలిసి దరఖాస్తుదారుల సమక్షంలో వైన్ షాపుల కేటాయింపు కొరకు లక్కీ డ్రా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 32 వైన్ షాపులకు గాను 27 వైన్ షాపులను కేటాయించడం జరిగిందని, కేటాయింపు ప్రక్రియ లక్కీ డ్రా పద్ధతిన పూర్తి పారదర్శకంగా నిర్వహించినట్లు



తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆసిఫా బాద్ డిఎస్పి శ్రీనివాస్, ఆబ్కారి శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జిలిటెన్ స్టిక్స్ నిల్వ ఉంచిన వ్యక్తి అరెస్ట్

ఎస్పీ అఖిల్ మహాజన్

2 లో



# జిలిటెన్ స్టిక్స్ నిల్వ ఉంచిన వ్యక్తి అరెస్ట్

## ఎస్పీ అఖిల్ మహాజన్

రాజన్న సిరిసిల్ల, ఆగస్ట్ 21 (మనం న్యూస్): రాజన్న సిరిసిల్ల జిల్లా చిన్నబోనాలలో ప్రజా నివాస ప్రదేశాల్లో అక్రమంగా జిలిటెన్ స్టిక్స్ నిల్వవుంచిన ఓర్సు బంగారయ్య అనే వ్యక్తిని సోమవారం అరెస్టు చేసినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫార్మాట్రాక్ కంపెనికి చెందిన బీ/నెం. ఏపీ-27-టీటీ-5906 గల 153 జిలిటెన్ స్టిక్స్, 8 మీటర్ల పొడవు గల ఒక కార్డేక్స్ వైర్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వల్లెపు తిరుపతి మరో నిందితుడు పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. నిందితుడు బంగారయ్య జిలెటిన్ స్టిక్స్ ప్రమాదకరంగా నిల్వ ఉంచాడన్న సమాచారం మేరకు సిరిసిల్ల టౌన్ పోలీసులు చిన్న బోనాలలోని బంగారయ్య ఇంట్లో తనిఖీ చేయగా, కంప్రెషర్ ట్రాక్టర్ లో, కిరాయి ఇంటిలో ప్రమాదకరంగా ఉన్న జిలిటెన్ స్టిక్స్, పేల్చడానికి ఉపయోగించే కార్డేక్స్ వైర్ ను నిల్వ ఉంచినట్లు గుర్తించినట్లు తెలిపారు. వాటిని స్వాధీనపర్చుకొని బంగారయ్య ను అదుపులోకి తీసుకొని విచారించగా, దాదాపు ఆరు నెలల క్రితం నిందితుడు వల్లెపు తిరుపతి వద్ద ఒక కాటన్ జిలిటెన్ స్టిక్స్ 157 వరకు కొనుగోలు చేసినట్లు తేలినట్లు తెలిపారు. వాటిలో కొన్నింటిని ఉపయోగించి,





మిగతా వాటిని దాచిపెట్టినట్లు తెలిపారు. జిలిటెన్ స్టిక్స్ పేలితే ఆస్తిమ్ ప్రాణ నష్టం జరుగుతుందని తెలిసి కూడా ఎలాంటి అనుమతులు లేకుండా తన ఇంటిలో పెట్టుకొని, బండ పనులలో వాడుకోవడానికి నిల్వ ఉంచినట్లు నిందితుడు ఒప్పుకోవడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా బంగారయ్యను రిమాండ్ కి తరలించినట్లు ఎస్పీ పేర్కొన్నారు.మరో నిందితుడు వల్లెపు తిరుపతి కోసం స్పెషల్ టీమ్ వెతుకుతుందని, త్వరలో తిరుపతిని పట్టుకోవడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఎవరు కూడా ప్రజా నివాస ప్రాంతాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా, లైసెన్స్ లేకుండా జిలిటెన్ స్టిక్స్ కానీ, పేలుడు పదార్థాలు నిల్వ ఉంచినట్లయితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్పీ హెచ్చరించారు. జిలిటెన్ స్టిక్స్ వినియోగించినట్లయితే అనుమతి, లైసెన్స్ తప్పని సరిగా తీసుకోవాలన్నారు. ఎవరైనా జిలిటెన్ స్టిక్స్ వంటి పదార్థాలు నిల్వ ఉంచినట్లయితే డయల్ 100 కి గానీ దగ్గరలో ఉన్న పోలీస్‌లకు గానీ సమాచారం అదించాలని కోరారు. సమాచారం ఇచ్చినవారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు. ఈ మీడియా సమావేశంలో సిరిసిల్ల డిఎస్పీ ఉదయ్ రెడ్డి, టౌన్ సిఐ ఉపేందర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## రామగుండం కాంగ్రెస్ టికెట్ నాకే ఇవ్వాలి

### న్యాయవాది ఎంచర్ల మహేష్ యాదవ్



గోదావరిఖని,ఆగస్టు 21 (మనం న్యూస్): కాంగ్రెస్ పార్టీ టికెట్ తనకే ఇవ్వాలని న్యాయవాది ఎంచర్ల మహేష్ యాదవ్ సోమవారం గాంధీ భవన్ లో దరఖాస్తు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోదావరిఖనిలో పుట్టి,పెరిగి ఇక్కడే చదువుకున్నానని, ఇక్కడ ప్రజలతో తమకు మంచి అనుబంధం ఉందని అన్నారు. అలాగే ఎన్ఎస్ యుఐ కార్పొరేషన్ అధ్యక్షులుగా, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా కాంగ్రెస్ పార్టీలో సేవలు అందించానని తెలిపారు.ఒక ఉద్యమకారుడుగా తెలంగాణ ఉద్యమ సమయంలో తాను రాష్ట్ర సాధనకై పోరాటాలు చేసినానన్నారు. రామగుండం నియోజకవర్గంలో యాదవుల ఓట్లు అధికంగా ఉన్నాయని, తమ సామాజిక వర్గానికి చెందిన ప్రజలు తమను ఆశీర్వదిస్తారనే నమ్మకం ఉన్నదని అన్నారు. అలాగే విద్యార్థి నాయకుడిగా ఉన్న సమయంలో విద్యార్థుల సమస్యలపై ఎన్నో పోరాటాలు చేసి వారి సమస్యలు పరిష్కరించానని తెలిపారు. రామగుండం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ టికెట్ తమకే కేటాయిస్తే తను గెలిచే అవకాశాలు ఎక్కువ ఉన్నాయని ధీమా వ్యక్తం చేశారు.

## దళిత యువకున్ని హత్య చేసిన వారిని శిక్షించాలని ఆందోళన



మెట్ పల్లి, ఆగస్టు 21 (మనం న్యూస్): దళిత యువకుడు సతీష్‌ను హత్య చేసిన వారిని వెంటనే అరెస్టు చేసి శిక్షించాలని మృతుని కుటుంబ సభ్యులు, బంధువులు, మహిళా సంఘాలు, దళిత సంఘాలు, సోమవారం పట్టణంలోని పాత బస్టాండ్ శాస్త్రి విగ్రహం వద్ద జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సంఘాల నాయకులు మాట్లాడుతూ గత ఆదివారం రాత్రి కన్నం సతీష్ అనే ను పట్టణానికి చెందిన ఇరువురు వ్యక్తులు తీసుకువెళ్లి కర్రలతో దాడి చేసి హత్య చేశారన్నారు. మృతుడికి భార్య ఇద్దరు చిన్నపిల్లలు ఉండడంతో ఆయన కుటుంబం రోడ్డు మీద పడిందన్నారు. ఆయన కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రోజుకోరీతిలో జరుగుతోన్న మారణకాండను ఆపే విధంగా ప్రభుత్వం, పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు. ఇంచార్జి డిఎస్పి వెంకటస్వామి ధర్నా స్థలానికి వచ్చి నిందితులను త్వరలో అరెస్టు చేస్తామని హామీ ఇవ్వడంతో శాంతించారు.

## ఘనంగా నాగుల పంచమి వేడుకలు



ఇల్లందకుంట, ఆగస్టు 21 (మనం న్యూస్): ప్రతి సంవత్సరం శ్రావణ మాసం శుక్లపక్షం పంచమి తిథి రోజున నిర్వహించుకునే నాగుల పంచమి వేడుకలు సోమవారం ఇల్లందకుంట మండల వ్యాప్తంగా భక్తి శ్రద్ధల మధ్య ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మండలంలోని శ్రీరాములపల్లి గ్రామంలో స్వయంభూ సంతాన నాగ శివ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో గ్రామ ప్రజలతో పాటువరంగల్ జిల్లా, పెద్దపెల్లి జిల్లాతో పాటు వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు మటికి రమేష్, కౌడగాని రవీందర్, లింగంపల్లి రాజేశ్వరరావులు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేపట్టారు.

## సతీష్ హత్య ఘటనలో నిందితులను త్వరలో పట్టుకుంటాం

### ఇంచార్జి డిఎస్పి వెంకటస్వామి



మెట్ పల్లి, ఆగస్టు 21 (మనం న్యూస్): ఆదివారం రాత్రి కన్నం సతీష్ అనే యువకున్ని దారుణంగా కొట్టి చంపిన నేరస్తులను త్వరలో అరెస్టు చేస్తామని ఇంచార్జి డిఎస్పి వెంకటస్వామి తెలిపారు. సోమవారం పట్టణంలోని సీఐ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఆదివారం రాత్రి 11 గంటల 20 నిమిషాలకు కన్నం సతీష్ అతని ఫ్రెండ్ అయినా నిఖిల్ ఇద్దరు ఒక షాపు వద్ద ఉండగా పట్టణానికి చెందిన జక్కం రాజేష్ అతని ఫ్రెండు నవీన్ ఇద్దరు కలిసి కన్నం సతీష్ ను మాట్లాడేది ఉన్నది అంటూ పక్కనే ఉన్న నిర్మానుష్య ప్రదేశానికి తీసుకొని వెళ్లినట్లు ఆయన తెలిపారు అనంతరం ఇద్దరూ కన్నం సతీష్ పై కర్రలతో దాడి చేసినట్లు తెలిపారు. అరుపులు విన్న సతీష్ స్నేహితుడు నిఖిల్ అక్కడికి చేరుకునేసరికి అతనిపై కూడా దాడి చేసి నిందితులు మోటార్ సైకిల్ పై పరారయ్యారన్నారు. వెంటనే నిఖిల్ సతీష్ ను ఆసుపత్రికి తీసుకెళ్లగా డాక్టర్లు అతను చనిపోయినట్లుగా నిర్ధారించి చెప్పడంతో సతీష్ చనిపోయాడని నిఖిల్ సతీష్ తండ్రి రాజయ్య కు ఫోన్ చేసి తెలపగా హుటాహుటిన రాజయ్య ఆసుపత్రికి చేరుకొని చనిపోయిన తన కుమారుని చూసి తన కుమారుని పై దాడి చేసిన వారిని అరెస్టు చేసి కఠినంగా అరెస్టు చేయాలని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

## బిఆర్ఎస్ దళాన్ని ప్రకటించిన

# గులాబీ బాస్

మొదటి పేజీ తరువాయి..

బరిలోకి దింపనున్నట్లు ప్రకటించారు. కోరుట్ల నియోజకవర్గం నుంచి ప్రస్తుత ఎమ్మెల్యే తనయుడు డాక్టర్ కల్వకుంట్ల సంజయ్‌కుమార్ అభ్యర్థిత్వాన్ని ఖరారు చేశారు. పెద్దపల్లి, చొప్పదండి, మానకొండూరు, రామగుండం నియోజకవర్గాల అభ్యర్థిత్వాల విషయంలో వెలువడ్డ ఊహాగానాలకు తెరదించిన కెసిఆర్ ఆయా స్థానాల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేలకే ప్రాధాన్యతనిచ్చారు. పెద్దపల్లి నుంచి దాసరి మనోహర్‌రెడ్డి, చొప్పదండి నుంచి సుంకె రవిశంకర్, మాన కొండూరు నుంచి రసమయి బాలకిషన్, రామగుండం నుంచి కోరుకంటి చందర్‌లకే ఈ సారి కూడా అవకాశమిచ్చారు. కాగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తోన్న మంత్రులు కెటిఆర్, గంగుల కమలాకర్, కొప్పుల ఈశ్వర్‌లు మరోసారి బరిలో దిగనున్నారు. అదే విధంగా హుస్నాబాద్ నుంచి ఒడితెల సతీష్‌కుమార్, జగిత్యాల స్థానం నుంచి డాక్టర్ సంజయ్, మంథని నుంచి పుట్ట మధులకు అవకాశం కల్పిస్తూ కెసిఆర్ జాబితాను విడుదల చేశారు.

## కొత్తపల్లిలో బిఆర్ఎస్ శ్రేణుల సంబరాలు



కొత్తపల్లి, ఆగస్టు 21 (మనం న్యూస్): మంత్రి గంగుల కమలాకర్‌కు కరీంనగర్ అసెంబ్లీ స్థానం అభ్యర్థిగా మరోసారి అవకాశమిస్తూ కెసిఆర్ ప్రకటన చేయడాన్ని హర్షిస్తూ మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు ఆధ్వర్యంలో సోమవారం స్థానిక బస్టాండ్ వద్ద బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా రుద్ర రాజు మాట్లాడుతూ మంత్రి గంగుల కమలాకర్ మరోసారి ఘనవిజయం సాధించి మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, కో-ఆప్షన్ మెంబర్లు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు ,కార్యకర్తలు పాల్గొన్నారు.

# పద్మశాలీలు ఐక్యత చాటాలి

## పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు

కొమురంభీం ఆసిఫాబాద్, ఆగస్టు 21 (మనం న్యూస్)ః పద్మశాలీలంతా సంఘటితంగా ఉండి ఐక్యత చాటాలని పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పద్మశాలి భవనంలో సెప్టెంబర్ 3న హైదరాబాదులో కొండా లక్ష్మణ్ బాపూజీ ప్రాంగణంలో నిర్వహించనున్న పద్మశాలి శంఖారావం సంబంధించిన వాల్ పోర్లను సంఘం నాయకులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పద్మశాలీలు ఒకటై సామాజిక ,రాజకీయ, ఆర్థిక ఎదిగేందుకు ఐక్యంగా ముందుకు వెళ్లాలని కోరారు. ఉనికిని చాటేందుకే శంఖారావం నిర్వహించడం జరుగుతుందని ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్క కుల బాంధవుడు వచ్చి విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు సామల రాజన్న జిల్లా ప్రధాన కార్యదర్శి గడదాసు మల్లయ్య రాష్ట్ర నాయకులు గుండా శంకర్ నల్ల కనకయ్య నాయకులు లింగయ్య శ్రీకాంత్ ధర్మయ్య అనుమాండ్ల శ్రీకాంత్ శైలేందర్



ప్రణయ్ శ్యామ్ ప్రకాష్ శ్రీనివాస్ మోహన్ వేణుగోపాల్ తిరుపతి మహేష్ ప్రకాష్ ప్రవీణ్ అశోక్ సునీల్ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



## ఖనిలో వైభవంగా నాగుల పంచమి

గోదావరిఖని, ఆగస్టు 21 (మనం న్యూస్): గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతంలో నాగుల పంచమి పర్వదినాన్ని మహిళలు వైభవంగా జరుపుకున్నారు. సోమవారం అధిక సంఖ్యలో మహిళలు పుట్టల వద్దకు చేరుకుని పసుపు,కంకుమ,పాలు,పండ్లు,పూలు,కోడిగుడ్లతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.పుట్టలో పాలు పోసి కోరిన కోరికలు నెరవేరాలని,తమ కుటుంబ సభ్యులు బాగుండాలని భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన డిఎంహెచ్‌వో



ఇల్లంతకుంట, ఆగస్టు 21 (మనం న్యూస్)ః ఇల్లంతకుంట మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుమన్ మోహన్ రావు సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రోజు వారి ఓపి, జ్వర రోగుల నమోదు,సిబ్బంది సమయ పాలన, రక్త పరీక్షలు, అందుబాటులో ఉన్న మందులను ఆయన పరిశీలించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అన్ని రకాల సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటూ రోగులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గర్భిణీ స్త్రీల నమోదు పెంచాలని, సాధారణ డెలివరీలు అయ్యేల మోటివేషన్ చేయాలని, పిల్లల టీకాలు వేయించి ఎప్పటికప్పుడు నమోదు చేయాలని, సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించి డ్రై డేను నిర్వహిం చాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారులు డాక్టర్ కట్ట రమేశ్, డాక్టర్ శరణ్య, ఆయుష్ డాక్టర్ శరణ్య, హెచ్ ఈ ఓ లింగం, సి హెచ్ ఓ శాంత, హెచ్ ఈ ఓ వెంకట రమణ, పి హెచ్ న్ లలిత కుమారి, సూపర్వైజర్ జవహర్, ఏ ఎన్ ఎం లు, ఆశాలు, మిగతా వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్‌ఎంపి, పిఎంపిలకు అవగాహన కార్యక్రమం



సిర్పూర్ (టి)ఆగస్టు21( మనం న్యూస్):మండల కేంద్రంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో సోమవారంఆర్ఎంపీ పీఎంపి ల అవగాహన కార్యక్రమం నిర్వహించామని ఆర్ఎంపీ తాలూకా అధ్యక్షులు తులసీదాస్ తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా సిర్పూర్(టి) ఎస్ఐ ధీకొండ రమేష్ హాజరయ్యారు.అనంతరం ఆర్ఎంపి, పిఎంపి లకు మెంబ షిప్ సర్టిఫికెట్స్ అందించారు. ఆర్ఎంపి,పిఎంపిలు సిర్పూర్ (టి) ఎస్ఐ దికోండ రమేశ్‌ను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఆర్ఎంపీ తాలూకా అధ్యక్షుడు దాస్ మండల జనరల్ సెక్రరేటరి అమృత్ సర్దార్, వైస్ ప్రెసిడెంట్ బుక్యా వినోద్, ట్రేజరర్ లక్ష్మణ్, గౌరవ అధ్యక్షుడు అబ్రార్ హైమద్, అజ్జు,ఉమేష్,రఘునాథ్, పరమేష్,శేంకర్, ఎమ్మజీ, రతన్,తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ రెబల్ అభ్యర్థిగా డాక్టర్ గోలి మోహన్



వేములవాడ టౌన్, ఆగస్ట్ 21, (మనం న్యూస్): రానున్న శాసన సభ ఎన్నికల్లో వేములవాడ నియోజకవర్గ బీఆర్ఎస్ రెబల్ అభ్యర్థిగా డాక్టర్ గోలి మోహన్ పోటీ చేయనున్నట్లు తెలుస్తుంది. బీఆర్ఎస్ పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ వేములవాడ బీఆర్ఎస్ టిక్కెట్ చెలిమెడ నరసింహ రావుకు ఖరారు చేసినట్లు సోమవారం ప్రకటించారు. దీంతో బీఆర్ఎస్ టిక్కెట్ కోసం ఆశించిన గోలి మోహన్ కు చుక్కెదురైంది. అయినప్పటికీ డాక్టర్ గోలి మోహన్ బీఆర్ఎస్ రెబల్ అభ్యర్థిగా ఎన్నికల బరిలో నిలువనున్నట్లు సమాచారం. ఇదివరకే డాక్టర్ గోలి మోహన్ బీఆర్ఎస్ టిక్కెట్ దక్కని పక్షంలో బీఆర్ఎస్ రెబల్ అభ్యర్థిగా పోటీ చేయనున్నట్లు ప్రకటించారు.

## పారదర్శకంగా మద్యం దుకాణాలకు లక్కీ డ్రా



రాజన్న సిరిసిల్ల, ఆగస్ట్ 21 (మనం న్యూస్): రాజన్న సిరిసిల్ల జిల్లాలోని మద్యం దుకాణాలకు కలెక్టర్ అనురాగ్ జయంతి ఆధ్వర్యంలో దరఖాస్తుదారుల సమక్షంలో జిల్లా ఎక్సైజ్ అధికారులు సోమవారం లక్కీ డ్రా నిర్వహించారు. 2023–25 ఎక్సైజ్ పాలసీకి సంబంధించి జిల్లాలో 48 మద్యం దుకాణాల కేటాయింపునకు అధికారులు లక్కీ డ్రాను ఉదయం 11 గంటలకు ప్రారంభించారు. లాటరీ పద్ధతిన అర్హులను ఎంపిక ప్రక్రియ చేపట్టి ఎంపికైనవారి పేర్లను వెంటనే ప్రకటించారు. గౌడ కమ్యూనిటీ కి 15 శాతం అనగా (9), ఎస్సీలకు 10 శాతం అనగా (5) మద్యం దుకాణాలకు రిజర్వ్ కాగా , 70 శాతం అనగా (34) మద్యం దుకాణాలకు జనరల్ క్రింద కేటాయించారు. ఎంపికైనవారు ఈ నెల 23లోగా నిర్ణీత వార్షిక లైసెన్స్ రుసుంలో ఆరో వంతు చెల్లించాల్సి ఉంటుంది. లైసెన్సుదారులు డిసెంబర్ 1 నుంచి కొత్త దుకాణాల్లో అమ్మకాలకు అనుమతిస్తారు. ఈ లక్కీ డ్రాలో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్ ఖీమ్యా నాయక్, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్ పంచాక్షరి, సిరిసిల్ల సీఐ గులాం ముస్తాఫా, ఎంపీఆర్ మరాఠీ పోష్ రాజ, ఎల్లారెడ్డిపేట సీఐ చంద్రశేఖర్, వేములవాడ సీఐ కరుణాకర్ పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించాలని ప్రజా సంఘాల ధర్నా




ఇల్లంతకుంట, ఆగస్టు 21 (మనం న్యూస్)ః మండల ప్రజల సమస్యలు తీర్చాలని డిమాండ్ చేస్తూ దళిత, బహుజన ప్రజా సంఘాల ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమం లో తెలంగాణ రైతు రక్షణ సమితి రాష్ట్ర కన్వీనర్ తీపిరెడ్డి తిరుపతి రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గన్నేరం నర్సయ్య, తెలంగాణ రాష్ట్ర దళిత సంఘాల జిల్లా అధ్యక్షుడు సావనపెల్లి రాకేష్, మాజీ సర్పంచ్ సుంకపాక ఎల్లయ్య, ౘఅఇఖి మాజీ డైరెక్టర్ పసుల నరేష్ కుమార్, ఇఖ్ఖీ మండల అధ్యక్షుడు సావనపెల్లి రాములు, భవన నిర్మాణ కార్మిక సంఘం మండల ఉపాధ్యక్షుడు సావనపెల్లి శంకర్, అంబేద్కర్ సంఘాల నాయకులు బిగుళ్ల పర్శరాములు, రామంచ నర్సయ్య, నాగరాజు, ప్రవీణ్, రాయమల్లు, దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

## నేరస్తులకు సమాజంలో స్థానం లేదు ఎస్సై చంద్రశేఖర్



కొత్తపల్లి, ఆగస్టు 21 (మనం న్యూస్)ః నేరస్తులకు సమాజంలో స్థానం లేదని, ప్రస్తుతం రౌడీ షీటర్లుగా రికార్డులో నమోదైన వారు తమ ప్రవర్తనను మార్చుకుని నేర ప్రవృత్తికి దూరంగా ఉండాలని కొత్తపల్లి ఎస్సై దేశ్ చంద్రశేఖర్ సూచించారు. సోమవారం కరీంనగర్ జిల్లా కొత్తపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రౌడీ షీటర్లు, పాత నేరస్తులు ప్రవర్తన మార్చుకొని సమాజంలో మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు, నేరాలకు పాల్పడకుండా కుటుంబ సభ్యులతో కలిసి స్వేచ్ఛగా జీవించే విధంగా మెలగాలని తెలిపారు. సత్ప్రవర్తనతో నడుచుకోకుండా, నేరాలకు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోనున్నట్లు నగర బహిష్కరణ చేయనున్నట్లు హెచ్చరించారు.

# మరోసారి నడిపెల్లికే అవకాశం



మంచిర్యాల 21, ఆగస్టు (మనం న్యూస్ ) : మంచిర్యాల నియోజకవర్గం బిఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిత్వాన్ని సిట్టింగ్ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావుకే మరోసారి ఖరారు చేస్తూ గులాబీ బాస్ కెసిఆర్ ప్రకటించారు. దీంతో దివాకర్ రావు వర్గీయలు సంబరాల్లో మునిగిపోయారు. సర్వేలు ఎన్ని రకాలుగా వచ్చినా కెసిఆర్ దివాకర్ రావు వైపే మొగ్గు చూపడం విశేషం. టికెట్ తనకు కాకుండా తన కుమారుడు విజ్జిత్ రావు కోసం ఎన్ని ప్రయత్నాలు చేసిన ఫలితం దక్కలేదు. నాడు టిఆర్ఎస్ అభ్యర్థిగా రెండు సార్లు గెలిచారు. నేడు బిఆర్ఎస్ అభ్యర్థి గా బరిలో నిలిచిగెలుపు సాధించి ముచ్చటగా హ్యాట్రిక్ సాధిస్తారా లేదా అన్నది ఓటర్లపై ఆధారపడి ఉంది. ఈ నియోజకవర్గంలో ఎక్కువగా బిసి ఓటర్లు ఉండగా, కులాలకు అతీతంగా ఎవరో ఒకరిని బిసి నేతను బిఆర్ఎస్ తరపున పోటీకి ఆశవాహులు చాలా మంది లాబీలు చేసినా కెసిఆర్ ముందు అవేమి ఫలించిలేదనే చెప్పాలి. కెసిఆర్ తీసుకున్న ఈ నిర్ణయం మేరకు బిసి సామాజిక వర్గానికి చెందిన ఓటర్లు నడిపెల్లికి మద్దతిస్తారా.. లేదా అన్నది వేచి చూడాల్సిందే. ఎన్నికలకు ఇంకా సమయం ఉన్న నేపథ్యంలో బిసిల తరపున ఇండిపెండెంట్ గా అభ్యర్థి ని నిలపడానికి చాలా నెలల నుంచి రహస్య సమావేశాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో బిఆర్ఎస్‌తో పాటు బిసి కుల సంఘాల సభ్యులు ఆలోచనలో పడ్డారు. ఇక కాంగ్రెస్ అభ్యర్థి గా కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు కే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.2018ఎన్నికల్లో విజయం అంచుదాకా వచ్చి తెరాస అభ్యర్తి దివాకర్ రావు చేతిలో ఓడిపోయారు. దివాకర్ రావుకు 75360 ఓట్లు రాగా, ప్రేమ్ సాగర్ రావుకు 70512 ఓట్లు పడ్డాయి. కోల్ బెల్ట్ లోని సింగరేణి వాడలైన నస్పూర్, శ్రీరాంపూర్ ప్రాంతాల కార్మిక ఓటర్లు చివరి నిమిషం లో తెరాస కు జై కొట్టడం తో ప్రేమ్ సాగర్ రావు స్వల్ప ఓట్ల తేడాతో పరాజయం కాక తప్పలేదు. బీజేపి తరపున పోటీ చేసిన వి. రఘునాథ్ రావు కు కేవలం 5018 పోలయ్యాయి. ఒకసారి ఈ నియోజకవర్గం పాత రోజుల్లోకి వెళితే.1972 లో అపుడు మంచిర్యాల కాకుండా లక్సట్టిపేట్ నియోజకవర్గం గా ఉండేది.1972 ఎన్నికల్లో అప్పటి ఇందిరా కాంగ్రెస్ అభ్యర్థి నర్సింగారావు గెలిచారు. ఆయనకు 32258 ఓట్లు రాగా, భారతీయ జన సంఘ్ నుంచి పోటీ చేసిన చుంచు లక్షయ్య కు 18631 ఓట్లు వచ్చాయి.1978 లో జనతా పార్టీ నుంచి పోటీ చేసిన చుంచు లక్షయ్య కు 22716 ఓట్లు, కాంగ్రెస్ అభ్యర్థి జ. వి. నర్సింగారవు కు 18631, కాంగ్రెస్ (ఐ ) తరపున పోటీ చేసిన కండె వెంకట రమణయ్యకు 20744 ఓట్లు వచ్చాయి.1983 ఎన్నికల్లో తెలుగుదేశం ప్రభావాన్ని తట్టుకుని ఇండిపెండెంట్ అభ్యర్థి ఎం. మురళి మోహన్ రావు గెలిచారు. ఈయన కు 28976 ఓట్లు రాగా కాంగ్రెస్ అభ్యర్థి ఎం. అర్జునరావుకు 13,832 వచ్చాయి. బరిలో మరో నాలుగు ఇండిపెండెంట్ అభ్యర్థులు కూడా పోటీ చేశారు. ఇక 1985 ఎన్నికల్లో జి. వి సుధాకర్ రావు కాంగ్రెస్ అభ్యర్థి గా 43140ఓట్లు సాధించి గెలిచారు. తెలుగుదేశం అభ్యర్థి గా పోటీ చేసిన జి. కృపాకర్ కు 27921 ఓట్లు వచ్చాయి.1989 ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ అభ్యర్థి సుధాకర్ రావు తిరిగి గెలిచారు. ఈయనకు 46349 ఓట్లు రాగా తెలుగుదేశం అభ్యర్థి కే.సురేందర్ కు 41435 ఓట్లు, జనతా పార్టీ అభ్యర్థి ఎండీ. శాందాని కి 1555 ఓట్లు వచ్చాయి. ఇక 1994 ఎన్నికల్లో తెలుగుదేశం అభ్యర్థి గోనె హన్మాంతరావు 78572 ఓట్ల తో గెలిచారు. కాంగ్రెస్ అభ్యర్థి గోనె వెంకట కృష్ణా రావు కు 45262, బిజెపి అభ్యర్థి కే. విద్యా సాగర్ రావుకు కేవలం 3818, బంగారం. బి ఎస్. పి. అభ్యర్థి కుంచెం రాందాస్ యాదవ్ కు 779 ఓట్లు మాత్రమే వచ్చాయి.1999 ఎన్నికల్లో దివాకర్ రావు మొదటి సారిగా ఎమ్మెల్యే గా కాంగ్రెస్ తరపున బరిలో నిలిచి గెలుపు సాధించారు. ఈయనకు 76581 రాగా తెలుగుదేశం అభ్యర్థి గోనె హన్మంత్ రావుకు 63348 ఓట్లు వచ్చాయి. ఇక 2004 ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ తరపున దివాకర్ రావు 60530 ఓట్లు సాధించి గెలిచారు. తెలుగుదేశం అభ్యర్థి గోనె హన్మంత్ రావు 60364 ఓట్ల స్వల్ప తేడా తో ఓటమి చవి చూసారు. జనతా పార్టీ నుంచి పోటీ చేసిన కే. వి. ప్రతాప్ కు 29986 ఓట్లు రావడం విశేషం.. ఈయన బరిలో లేకుంటే తెలుగుదేశం అభ్యర్థి కి అవకాశం ఉండేదని చెప్పుకున్నారు. ఇక తెలంగాణా ఉద్యమం ఉధృతం గా సాగుతున్న దశలో 2009 లో తెరాస నుంచి గడ్డం అరవింద రెడ్డి గెలిచారు. ఈయన కు 58340 ఓట్లు రాగా,సమీప కాంగ్రెస్ అభ్యర్థి దివాకర్ రావు కు 44513 ఓట్లు వచ్చాయి. ఇక 2010 లో జరిగిన ఉప ఎన్నికల్లో కూడా గడ్డం అరవింద రెడ్డి గెలుపు సాందించారు. తెలంగాణ రాష్ట్రము సాధించిన తర్వాత జరిగిన ఎన్నికలు మంచిర్యాల నియోజకవర్గం లో చిత్ర విచిత్రం తో జరిగాయి.. ఈసారి బిఆర్ఎస్ అభ్యర్థి గా నడిపెల్లి దివాకర్ రావు పోటీ చేయగా 95171 ఓట్లు సాధించి గెలుపొందారు. కాంగ్రెస్ అభ్యర్థి గా గడ్డం అరవింద్ రెడ్డి పోటీ చేసి ఓడిపోయారు.

ఈయనకు 35921 మాత్రమే పోలయ్యాయి.2018 ఎన్నికల్లో తిరిగి తెరాస తరపున దివాకర్ రావు 75360 ఓట్లు సాధించాగా, సమీప కాంగ్రెస్ అభ్యర్థి కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు కు 70512 ఓట్ల స్వల్ప తేడాతో ఓటమి పాలయ్యారు. ఇక తెరాస నుంచి బారసా గా మారిన అందరికంటే ముందు అభ్యర్థులను ప్రకటించి కే. సీ. ఆర్. ప్రతి పక్షాలకు సవాలు విసిరారనే చెప్పాలి. మంచిర్యాల నియోజకవర్గం లో ఈసారి జరగబోయే ఎన్నికలు రసవత్తరం గా సాగే సూచనలు కనిపిస్తున్నాయి.ఎవరికి పట్టం కడతారో కాలమే నిర్ణయిస్తుంది.

## భక్తి శ్రద్ధలతో నాగుల పంచమి



సిర్పూర్ (టి)ఆగస్టు21( మనం న్యూస్): మండలం లోని పలు గ్రామాలతో పాటు మండలకేంద్రంలో నాగుల పంచమిని భక్తులు ఘనంగా జరుపుకున్నారు. సోమవారం తెల్లవారు జామునుండి ఆలయాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేసి, నాగుల పుట్ట వద్ద పాలు పోసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదే విధంగా నాగమ్మ చెరువు సమీపంలోని నాగుల పుట్ట వద్ద భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని నాగ దేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## కాంగ్రెస్ ఎమ్మెల్యే టికెట్‌కు ఎండి షాకీర్ సిద్దిక్ దరఖాస్తు



మెట్ పల్లి ఆగస్టు 21 ( మనం న్యూస్ ): కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నుండి ఎమ్మెల్యే టికెట్ కొరకు పట్టణానికి చెందిన ఎండి షాకీర్ సిద్దిక్ సోమవారం హైదరా బాద్ గాంధీభవన్ లో కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఎన్నికల ఇన్చార్జ్ కుమార్ రావుకు దరఖాస్తు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 30 సంవత్సరాల నుండి రాజకీయంలో కాంగ్రెస్ తరపున మెట్ పల్లి మండల కోఆప్షన్ సభ్యునిగా, మెట్ పల్లి వార్డ్ మెంబర్ గా రెండుసార్లు, కౌన్సిలర్ గా, ఇప్పటికీ కాంగ్రెస్ పార్టీ తరపున తన భార్య కౌన్సిలర్ గా కొనసాగుతుందన్నారు. నియోజకవర్గంలో ఒకే ఒక్క కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకునిగా తనకున్న అనుభవంతో తను ఎమ్మెల్యే టికెట్ దరఖాస్తు చేసుకున్నట్లు ఆయన తెలిపారు.

## బీసీ సంఘం జిల్లా అధ్యక్షున్ని మర్యాదపూర్వంగా కలిసిన బిసి నాయకులు



మందమర్రి, ఆగస్టు 21( మనం న్యూస్): ఇటీవల హైదరాబాదులో జరిగిన విస్తృతస్థాయి సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ మంచిర్యాల జిల్లాకు చెందిన చంద్రమోహన్ గౌడ్ ను మంచిర్యాల జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులుగా ఏకగ్రీవంగా నియమించారు. బిసి సంఘం మంచిర్యాల జిల్లా అధ్యక్షులుగా ఎన్నికైన ఉదరి చంద్రమోహన్ గౌడ్ ను సోమవారం మంచిర్యాల లోని తన కార్యాలయంలో బీసీ సంక్షేమ సంఘం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో బీసీ సంఘం నాయకులు శాలువాతో సత్కరించి మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం రాబోయే రోజులలో భవిష్యత్ కార్యాచరణకు సంభందించి పలు విషయాలపై చర్చించారు, అలాగే సెప్టెంబర్ 10న హైదరాబాదులో తలపెట్టిన సింహ గర్జన సభ గోడ ప్రతుల ఆవిష్కరణ పై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మందమర్రి బిసి సంఘం పట్టణ అధ్యక్షుడు కొండిల్ల శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడు సకినాల శంకర్, వోద్దెం సాగర్, సలాం, దానపల్లి తిరుపతి, సత్యనారాయణ, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## చేసిన అభివృద్ధి పనులే టికెట్ రావడానికి దోహదపడ్డాయి

**- సీఎం కేసీఆర్,మంత్రులు కేటిఆర్,ఈశ్వర్‌లకు కృతజ్ఞతలు**

**- రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్**



గోదావరిఖని,ఆగష్టు 21 (మనం న్యూస్): నాలుగున్నరేళ్ళ కాలంలో నియోజకవర్గంలో తాను చేసిన అభివృద్ధి కార్యక్రమాలు తనకు టికెట్ రావడానికి దోహదపడ్డాయని, కెసిఆర్, కేటీఆర్,ప్రజలకు తనపై ఉన్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా నియోజకవర్గంలో బిఆర్ఎస్ పార్టీ జెండా ఎగరడమే లక్ష్యంగా పనిచేస్తానని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు.బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు,ముఖ్యమంత్రి కేసీఆర్ హైదరాబాద్ తెలంగాణ భవన్ వేదికగా సోమవారం ప్రకటించిన శాసనసభ అభ్యర్థుల తొలి జాబితా లో తన పేరు ప్రకటించడంపట్ల ఎమ్మెల్యే చందర్ హర్షం వ్యక్తం చేశా రు. సిఎం కేసీఆర్,మంత్రులు కేటీఆర్,కొప్పుల ఈశ్వర్ లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...పార్టీ అంటే కుటుంబం లాంటిదని, రామగుండం నియోజకవర్గంలోని బిఆర్ఎస్ నాయకులను అందరిని కలుపుకుపోతానని అన్నారు. బడుగు, బలహీన, సబ్బండ వర్గాల సంక్షేమం కోసం రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాల కొనసాగింపు కోసం రానున్న ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీని భారీమెజార్టీతో గెలిపించాలని చందర్ ప్రజలను కోరారు.

## ప్రజల అండదండలతో హ్యాట్రిక్ విజేతగా గెలుస్తా

**-ఎమ్మెల్యే డా.రసమయి బాలకిషన్ ధీమా**




తిమ్మాపూర్, ఆగస్టు 21 (మనం న్యూస్): హైదరాబాదులోని తెలంగాణ భవన్ లో సోమవారం సీఎం కేసీఆర్ అసెంబ్లీ స్థానాలకు టిఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థులను ప్రకటించారు. ఈ నేపథ్యంలో కరీంనగర్ జిల్లా మానకొండూరు అసెంబ్లీ స్థానానికి మూడవసారి బీ.ఆర్.ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా రసమయి బాల కిషన్ కు టిక్కెట్ ప్రకటించడంతో నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ పెద్ద ఎత్తున ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ కు చేరు కొని శుభాకాంక్షలు తెలియజేసి ఘనంగా సన్మానించారు. ఆయా మండల కేంద్రాలు, గ్రామాలలో ఆనందోత్సాలతో బానాసంచా పేలుస్తూ, స్వీట్లు పంపిణి చేస్తూ సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా.రసమయి బాలకిషన్ మాట్లాడుతూ మానకొండూరు నియోజకవర్గం నుండి రెండుసార్లు భారీ మెజార్టీతో గెలిపించి, అక్కున చేర్చుకొని ఆశీర్వదించిన మానకొండూర్ నియోజక వర్గ ప్రజలకు జీవితాంతం రుణపడి ఉంటానన్నారు. మరోసారి నియోజకవర్గ ప్రజలకు సేవే చేసే అదృ ష్టాన్ని కలిగించిన సీయం కేసీఆర్, మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ కవితకు, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపా ధ్యక్షుడు బీ.వినోద్ కుమార్, మంత్రి గంగుల కమ లాకర్ లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మాన కొండూరు అసెంబ్లీ స్థానం నుండి మూడవసారి ఎమ్మెల్యేగా గెలుపొంది హ్యాట్రిక్ సాధించి సీఎం కేసీఆర్ కు బహుమతిగా ఇస్తానని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, పార్టీ శ్రేణులు, ప్రజలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ

### జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

పెద్దపల్లి, ఆగష్టు21 (మనం ప్రతినిధి): స్థానిక బందంపల్లిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల కు అందించిన పాఠ్య పుస్తకాలు, వర్క్ పుస్తకాలలోని పాఠ్య అంశాలను, విషయ పరిజ్ఞానంను విద్యార్థులతో చర్చించి, వారికున్న విషయ పరిజ్ఞానం పరిశీలించి సంతోషం వ్యక్తం చేశారు. ప్రాథమిక పాఠశాల వివరాలను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలును జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల





హాజరు శాతం పరిశీలిస్తూ, తల్లిదండ్రులతో తరుచూ సమావేశమవుతూ విద్యార్థుల విద్యా ప్రమాణాలపై వివరించాలని కలెక్టర్ తెలిపారు. అనంతరం అదే ప్రాంగణంలో ఉన్న అంగన్వాడీ సెంటర్‌ను పరిశీలించారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రాంగణంను పరిశీలించిన జిల్లా కలెక్టర్ కంపౌండ్ వాల్, కిచెన్ షెడ్, ఫ్లోరింగ్ మరమ్మత్తులు, టాయిలెట్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని పంచాయతీరాజ్ శాఖ ఈఈను కలెక్టర్ సూచించారు. ఈకార్యక్రమంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సరళ, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

### అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్



పెద్దపల్లి, ఆగష్టు 21 (మనం ప్రతినిధి)ప్రజావాణి దరఖాస్తులను సత్వర మే పరిష్కరించాలని అదనపు క లెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ అ న్నారు. సోమ వారం ప్రజా వాణి కార్యక్రమంలో భాగం గా సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో అద నపు కలెక్టర్ ప్రజల నుండి ఆర్జీలను స్వీకరిం చారు. అద నపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి దరఖాస్తులకు అధిక ప్రాధాన్యతనిచ్చి ప్రజలు ఇచ్చిన ఆర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి సమస్యలను సకాలంలో పరిష్కరించాలని అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

## బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసిన నల్ల మనోహర్‌రెడ్డి



పెద్దపల్లి, ఆగష్టు 21(మనం ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ప్రవేశపె ట్టిన టకెట్ల జాబితా వ్యవహారం లో భాగంగా గత 15ఏళ్లుగా బీ ఆర్ఎస్ పార్టీలో ఉంటూ ప్రజా సేవా చేస్తూ పార్టీకి చెప్పిన కార్య క్రమాలు చేస్తూ నిత్యం ప్రజ లలో మమేకంగా ఉంటూ ప్రజా శ్రేయస్సే ధ్యేయంగా పనిచేస్తున్న యువ న్యాయకత్వానికి అవకా శం ఇవ్వకుండా 70ఏళ్ల వ్యక్తికి అవకాశం ఇచ్చి గత 3పర్యాయాలుగా ఓపి కతో పార్టీ గెలుపు కోరకు ఆకర్నిషలు కృషి చేసిన నాకు రాజకీయాలలో ఉత్సాహం ఉన్న అవకాశం ఇవ్వకుండా యువకులకు అనగదొక్కుతున్న ప్రయత్నానికి చింతించి సోమవారం బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేస్తు న్నానని తెలిపారు. పెద్దపల్లి నియోజకవర్గ ప్రజలకు నేను ఈఎన్నికలలో నూటికి నూరు శాతం బరిలో ఉంటున్నానని అభిమానులు, కర్యాకర్తలు ఎవరూ అధైర్యపడవద్దని నల్ల మనోహర్‌రెడ్డి తెలిపారు.

# పొగాకు నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు

### విద్యార్థులకు పొగాకు వలన కలిగే నష్టాలపై అవగాహన

### జిల్లాలో మైనర్లు పొగాకు వాడకం జరగకుండా చర్యలు

### స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అరుణశ్రీ

పెద్దపల్లి, ఆగష్టు 21(మనం ప్రతినిధి)జిల్లాలో పొగాకు నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జె.అరుణశ్రీ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో పొగాకు నియంత్రణ కోసం చేపట్టిన చర్యలపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. అనంతరం అదనపు కలెక్టర్ ఆరుణశ్రీ మాట్లాడుతూ పొగాకు నియంత్రణ కోసం తీసుకున్న చర్యలపై శాఖల వారిగా నివేదికలు తయారు చేసి సమర్పించాలని అదనపు కలెక్టర్ అన్నారు. మైనర్లు, పిల్లలు పొగాకు బారిన పడకుండా జాగ్రత వహించాలని, చట్ట ప్రకారం మైనర్లకు విక్రయించడం నేరమని, దానిని జిల్లాలో పకడ్బందీగా అమలు జరిగేలాగా చర్యలు తీసుకోవాలని, మన ఇంట్లో పిల్లలు సమీపంలో ఉన్నప్పుడు సిగరేట్, బీడి పొగాకుకు సంబంధించినవి స్వీకరించకుండా పెద్దలకు సైతం అవగాహన కల్పించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అన్నారు. స్కూల్‌కు దగ్గర ఉన్న కిరాణ, ఫాన్ షాపులను తనిఖీ చేయాలని, అక్కడ సిగరేట్, పొగాకు విక్రయించకుండా చర్యలుతీసుకోవాలని అదనపు కలెక్టర్ సూచించారు. జిల్లా వ్యాప్తంగా 18ఏళ్ల కంటే తక్కువ వయసు గలవారికి సిగరేట్లు విక్రయించడానికి వీలులేదని, జిల్లాలో ఉన్న పాన్ డబ్బాలలో అకస్మిక తనిఖీలు నిర్వహించాలని అదనపు కలెక్టర్ సూచించారు. జిల్లాలో ఉన్న విద్యాసంస్థల్లో విద్యార్థుల అలవాట్లను పరిశీలించాలని, పొగాకు వాడకం వలన వచ్చే నష్టాలను వివరించాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో ప్రతి వారం రెండు విద్యాసంస్థల్లో పొగాకు వలన కలిగే నష్టాలపై ప్రచారం చేస్తూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అదనపు కలెక్టర్ డిఈఓను ఆదేశించారు. పొగాకు ఉత్పత్తుల చట్టం 2003సెక్షన్ 4ప్రకారం బహిరంగ ప్రదేశాలలో, కార్యాలయాలలో పొగాకు త్రాగడం నేరమని, సెక్షన్ 5 ప్రకారం



పొగాకు ఉత్పత్తుల ప్రకటనలు నిషేదించాలని, కిరాణ షాపుల వద్ద ఎక్కడా సిగరేట్ ప్యాకె ట్ల ప్రచారం నిర్వహించరాదని, సెక్షన్ 6ప్రకారం 18ఏళ్ల కంటే చిన్న పిల్లలకు అమ్మడం నేరమని స్కూలు కాలేజీల ఆవరణ నుంచి 100గజాల వరకు ఉత్పత్తులను అమ్మరాదని, ఈచట్టాలు పకడ్బందీగా అమల య్యే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. ఈసమావేశంలో వైద్యారోగ్య అధికారి డా.ప్రమోద్‌కుమార్, జిల్లా విద్యాశాఖ అధికారి మాధవి, జిల్లా నోడల్ అధికారి, ఫుడ్ సేఫీ అధికారి డా.మధుకర్‌రెడ్డి, డిఈఎంఓ వెంకటేశ్వర్లు, డ్రగ్ ఇన్స్పెక్టర్ కార్తిక్‌రెడ్డి, ఎస్‌టిఓ గోవర్ధన్, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి రాజగోపాల్, మంథని ఎండిఓ రమేష్, సుల్తానాబాద్ ఎండిఓ శశికల, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పి.సుదర్శన్, కమర్షియల్ ట్యాక్స్, కార్మికశాఖ, సంబంధితశాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌లో భారీగా చేరికలు

### కాంగ్రెస్‌లోకి రండీ..ఆత్మాభిమానంతో బ్రతకండి

### మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు



పెద్దపల్లి, ఆగష్టు 21(మనం ప్రతినిధి): ఆత్మాభిమానం చంపుకొని బీఆర్ఎస్‌లో కొనసాగకండీ.. కాంగ్రెస్ పార్టీలోకి రండీ ఆత్మాభి మానంతో బతకండీ అని మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ ఉపాధ్యక్షులు చింతకుంట వి జ యరమణారావు పిలుపు నిచ్చారు. సోమవారం ఆయన నివాసంలో బీఆ ర్ఎస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు కాంగ్రెస్‌పార్టీలో చేరారు. వా రిని పార్టీ కుండువా కప్పి సాదరంగా ఆహ్వా నించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పెద్దపల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్‌పార్టీ జెండా ఎగరేయ డం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. రాగినేడు, వడ్కాపూర్ గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు మాజీ సర్పంచ్ నా గపూరి తిరుపతి,లీలావతి, మాజీ వార్డు సభ్యులు బత్తిని తిరుపతి, మా మిడిపెల్లి పోచం, విశ్వబ్రాహ్మణ పెద్దపల్లి మండలాధ్యక్షుడు వేల్పూరి సత్యనారాయణ, బత్తిని రాజు, బీజేపీ గ్రామ యూత్ అధ్యక్షుల రంగు సంపత్, వడ్కాపూర్ గ్రామానికి చెందిన వార్డు సభ్యులు కాల్వల ఆంజనే యులు, కన్నం మదునయ్య, మంకాళి నర్సయ్య, ఇంజపూరి అంజయ్య, వివిధ పార్టీలకు చెందిన నాయకులు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈకార్యక్రమంలో మాజీ ఎంపీపీ గోపగాని సారయ్యగౌడ్, ఎంపీటీసీ పుప్పాల నిర్మల శ్రీనివాస్,మాజీ ఎంపీటీసీ తోడెటి స్వప్న తిరుపతి, గుమ్మడి విజయ్, బలమూరి దేవేందర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

# రహదారి బాగుపరచాలని కాంగ్రెస్ ఆందోళన

## రోడ్డుపై గుంతల్లో నాట్లు వేసి నిరసన

ఇల్లందకుంట, ఆగస్టు 21 (మనం న్యూస్)ః కరీంనగర్ జిల్లా ఇల్లందకుంట మండల కేంద్రంలోని అస్తవ్యస్తంగా ఉన్న రోడ్లను బాగుపరచాలని డిమాండ్ చేస్తూ సీనియర్ కాంగ్రెస్ నాయకులు వంగ రామకృష్ణ ఆధ్వర్యంలో సోమవారం రహదారిపై ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్లపై ఏర్పడ్డ పెద్ద పెద్ద గుంతల్లో నాట్లు వేసి, రాస్తారోకో చేపట్టి నిరసన తెలిపారు. అనంతరం రామకృష్ణ మాట్లాడుతూ మండల కేంద్రంలో రోడ్లు అస్తవ్యస్తంగా తయారై కనీసం నడవ లేని దుస్థితి నెలకొన్నా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. మండలంగా ఏర్పాటైనప్పటికీ కనీస మౌలిక వసతులు కల్పించడంలో స్థానిక ప్రజా ప్రతినిధులు



విఫలమయ్యారని



విమర్శించారు. ఈ సందర్భంగా అక్కడకు చేరుకున్న ఎస్సై రాజ్ కుమార్ స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి రోడ్డు మరమ్మతులు,డ్రైనేజీ నిర్మాణం పనులు పూర్తి అయ్యేలా చూస్తానని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కళ్లెం తిరుపతిరెడ్డి, అరెల్లి రమేష్ గౌడ్, మంకు ఐలయ్య, గడ్డి శ్రీనివాస్ యాదవ్ ,భోగం సాయిరాం,మర్రి వీరారెడ్డి, జిల్లెల్ల జలంధర్ రెడ్డి, వేముల సుధాకర్ రెడ్డి ,ఝఫీ అస్గర్ పాష, పిట్టల సతీష్ యూత్ కాంగ్రెస్ నాయకులు మారేపల్లి వంశీ, పెద్ది శివకుమార్,సుమన్ యాదవ్, జిల్లెల్ల సందీప్ రెడ్డి, దంసాని రమేష్ గ్రాఖీఐ నాయకులు దంసాని కిరణ్, అరుణ్ కుమార్, ఉడుత అనిల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



## పాడి అభ్యర్థిత్వం ఖరారుతో బిఆర్ఎస్ శ్రేణుల సంబరాలు

హుజురాబాద్ రూరల్, ఆగస్టు 21 (మనం న్యూస్)ః హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థిగా ఎమ్మెల్సీ పాడి కౌషిక్ రెడ్డి అభ్యర్థిత్వాన్ని ఖరారు చేస్తూ కెసిఆర్ ప్రకటించిన నేపథ్యంలో సోమవారం బిఆర్ఎస్ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా అంబేద్కర్ కూడలి వద్ద బాణాసంచా కాల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ప్రతాప తిరుమల్ రెడ్డి ,కేసి రెడ్డి లావణ్య, మారపల్లి సుశీల,కల్లపల్లి రమాదేవి, పిఎసిఎస్ చైర్మన్ ఎడవెల్లి కొండల్ రెడ్డి, బి ఆర్ ఎస్ మండల అధ్యక్షుడు సంగం ఐలయ్య, కొయ్యడ శ్రీదేవి, కమలాకర్, బి ఆర్ ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



## ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి




సిరిసిల్ల అర్బన్, ఆగస్టు 21 (మనం న్యూస్)ః విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ భారత విద్యార్థి ఫెడరేషన్ రాజన్న సిరిసిల్ల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులతో జిల్లా కలెక్టరేట్ ముట్టడి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు శనిగరపు రజినీకాంత్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు శనిగారపు రజనీకాంత్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విద్యారంగాన్ని నిర్వీర్యం చేసే కుట్ర పన్నుతోందని రెండోసారి అధికారంలోకి వచ్చిన బిఆర్ఎస్ ప్రభుత్వం కనీసం విద్యాశాఖ మంత్రి ఏ ఒక్కరోజు కూడా రాష్ట్రంలో ఉన్న విద్యారంగ సమస్యలపై సమీక్ష చేయకపోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా సమస్యల వలయంలో విద్య రంగం ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మీద ఉన్న శ్రద్ధ విద్యా రంగం మీద లేదన్నారు. బంగారు తెలంగాణ అంటే మద్యం షాపులు పెంచడం కాదు అందరికీ సమానమైన విద్య ఉపాధి అవకాశాలు విజ్ఞాన తెలంగాణ కావాలన్నారు. పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్ బకాయిలు 5177 కోట్ల రూపాయలను తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాలని, అదేవిధంగా ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాని, మన ఊరు మనబడి కార్యక్రమాన్ని ప్రతి ప్రభుత్వ పాఠశాలకు అమలు చేస్తూ అధిక బడ్జెట్ కేటాయించి ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్ మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ సమరభేరి జీపు జాతకు విద్యార్థుల అనేక సమస్యలు చెప్పుకున్నారన్నారు. ఏ మండలం,విద్యాసంస్థలకు వెళ్లిన సమస్యలే స్వాగతం పలుకుతున్నాయని అగ్రహారం డిగ్రీ కళాశాలను షిఫ్ట్ చేయొద్దు అంటూ పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయాలని ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ కేజీ టు పీజీ ఉచిత విద్య అందించాలని సమస్యలు విన్నవించినట్లు తెలిపారు. సమస్యలన్నీ పరిష్కరించకపోతే తీవ్ర ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మందా అనిల్ కుమార్, ఉపాధ్యక్షుడు కుర్ర రాకేష్, జాలపల్లి మనోజ్, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు వేణు, సాయి,ఆదిత్య, అభిషేక్, నవీన్, రాకేష్, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# పారదర్శకంగా మద్యం షాపుల కేటాయింపు

## కరీంనగర్ కలెక్టర్ గోపి

కరీంనగర్ బ్యూరో, ఆగస్టు 21 (మనం న్యూస్): జిల్లాలో మద్యం షాపులు కేటాయింపు లాటరీ పద్ధతి ద్వారా పారదర్శకంగా నిర్వహించినట్లు కలెక్టర్ డాక్టర్ బి.గోపి తెలిపారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన మద్యం షాపుల కేటాయింపు ప్రక్రియలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న 94 ఏ4 మద్యం షాపుల్లో ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల మేరకు గౌడ కులస్థులకు 17 షాపులు,






ఎస్సీలకు 9, జనరల్ కేటగిరి 68 షాపులు రిజర్వ్ చేసి సదరు షాపులను లాటరీ ద్వారా కేటాయించామని తెలిపారు. 94 మద్యం షాపులకు 4వేల40 దరఖాస్తులు వచ్చాయని, దరఖాస్తుదారుల సమక్షంలో పారదర్శకంగా లాటరీ పద్ధతిన మద్యం షాపుల కేటాయింపు చేశామన్నారు. మద్యం షాపుల కేటాయింపు మొత్తం ప్రక్రియను వీడియోగ్రఫీ చేయడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. దరఖాస్తుదారుల నుండి తిరిగిరాని రుసుముకింద 8 కోట్ల ఎనిమిది లక్షలు, షాపుల కేటాయింపు మొదటి విడత ఫీజు తొమ్మిది కోట్ల ఏడు లక్షల 50వేల రూపాయలు ప్రభుత్వ ఖజానాలో జమ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, ఎక్సైజ్ సూపర్డెంట్ తానాజీ, ఎన్ఫోర్స్మెంట్ సిఐలు, దరఖాస్తు దారులు, ఎక్సైజ్, ఫైర్, వైద్య శాఖ సిబ్బంది, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



### శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో ఘనంగా నాగుల పంచమి వేడుకలు

చిగురుమామిడి, ఆగస్టు 21 (మనం న్యూస్): కరీంనగర్ జిల్లా చిగురుమామిడి గ్రామ శివారులోని శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో సోమవారం నాగ పంచమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం భక్తులతో కిక్కిరిసిపోయింది. చిగురుమామిడి మండలంతో పాటు సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం, కోహెడ మండలం, కరీంనగర్, వరంగల్ తదితర సుధీర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున హాజరై నాగ పంచమి వేడుకల్లో పాల్గొన్నారు. శ్రీగురూజీ ఉమేష్ స్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయంలో ఉన్న పుట్టల్లో పాలు పోసి మహిళలు మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి మండల కో-ఆర్డినేటర్ పెనుకుల తిరుపతి, శాంతినగర్ ఉపసర్పంచ్ లింగం యాదవ్, చిగురుమామిడి మాజీ ఉపసర్పంచ్ తెరాల రజిత,తెరాల అమర్,సునీల్ కుమార్,ప్రవీణ్ కుమార్,రమేష్ ఆలయ కమిటీ సభ్యులు,భక్తులు తదితరులు పాల్గొన్నారు.

### సాయిబాబా ఆలయంలో ఘనంగా నాగుల పంచమి వేడుకలు



వేములవాడ టౌన్, ఆగస్ట్ 21 (మనం న్యూస్): వేములవాడ పట్టణంలోని సాయి బాబా ఆలయంలో సోమవారం నాగుల పంచమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మహిళలు ఆలయంలో ఉన్న పుట్టలో పాలు పోసి, ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు వారాల దేవయ్య, కార్యదర్శి గంప రాజేందర్, కొనమ్మగారి నాగరాజు, కూర రమేష్, తొగరి వెంకటేష్, పీచర రవీందర్ రావు, బండారి కుమార్, ఎంబేరి నర్సయ్యలు పాల్గొని భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేపట్టారు.



### నవాబుపేటలో ఘనంగా నాగుల పంచమి వేడుకలు

చిగురుమామిడి, ఆగస్టు 21 (మనం న్యూస్): నాగుల పంచమి పర్వదినాన్ని పురస్కరించుకొని కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం నవాబుపేట గ్రామ శివారులోని నాగమ్మ తల్లి ఆలయం భక్తులతో కిటకిటలాడింది.శ్రావణమాసం మొదటి సోమవారం,ఇదే రోజున నాగుల పంచమి కావడంతో చిన్న పెద్ద తేడా లేకుండా నవాబుపేట చుట్టుపక్కల గ్రామాలతో పాటు సిద్దిపేట జిల్లా కోహెడ మండలంలోని పలు గ్రామాల భక్తుల రాకతో దేవాలయం భక్తులతో కిక్కిరిసి పోయింది. అర్చకులు వెంకట రామకృష్ణ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించగా,భక్తులు భక్తిశ్రద్ధలతో నాగమ్మ తల్లి ఆలయానికి వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించి,ప్రక్కన ఉన్న నాగుల పుట్ట దగ్గరికి చేరుకొని పసుపు కుంకుమ పువ్వులు పుట్టలో వేసి కొబ్బరికాయలు కొట్టి పుట్టలో, నాగేంద్రునికి పాలు పోసి తమ దోషాలు కష్టాలు పోవాలని కష్టాలు కడితేరాలని ఆ నాగేంద్రునికి వేడుకుని భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు.నాగమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి భక్తులు సహకరించాలని పెండ్యాల రామ్ రెడ్డి కోరారు.ఆలయ నిర్మాణానికి పెండ్యాల లక్ష్మారెడ్డి 20వేలు, బత్తిని శ్రీనివాస్ 10వేలు,డాక్టర్ శ్రీరామ్ రెడ్డి 10వేలు వీరాళంగా అందజేసినట్లు చెప్పారు.ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు మంకు స్వప్న శ్రీనివాస్ రెడ్డి,ఆలయ నిర్వాకుడు పెండ్యాల రామ్ రెడ్డి,వార్డు సభ్యుడు మాడ శ్రీనివాస్, శ్రీపతి రెడ్డి, ఓరుగంటి రామ్మోహన్ రెడ్డి, వరికోలు రవీందర్, తదితరులు పాల్గొన్నారు.



### అభయ యాప్‌పై అవగాహన సదస్సు




మందమర్రి, ఆగస్టు 21 (మనం న్యూస్): పట్టణంలోని మంజునాథ ఫంక్షన్ హాల్ లో ఎస్ఐ చంద్రకుమార్ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లకు రోడ్ భద్రత, ట్రాఫిక్ రూల్స్, అభయ యాప్ పై సోమవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మహేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ముఖ్యంగా మహిళల రక్షణ కోసం ఆధునిక సాంకేతికను ఉపయోగిస్తూ మీ భద్రత మీ లక్ష్యం అనే నినాదంతో అభయ మొబైల్ అప్లికేషన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ యాప్‌ను మహిళా ప్రయాణికులు, గృహిణులు ఉపయోగించుకోవాలని సూచించారు. మహిళలు సురక్షితంగా పూర్తి రక్షణతో ప్రయాణించేందుకు ఈ యాప్ ను ఆవిష్కరించడం జరిగిందన్నారు. ఆపద సమయంలో ఈ యాప్ ను సద్వినియోగం చేసుకుని జరిగే ప్రమాదాలు నివారించుకోవాలని సూచించారు. క్యూఆర్ కోడ్ తో కూడిన యూనిట్ నెంబర్స్ ను ఏర్పాటు చేసిన నేపధ్యంలో పట్టణంలో ఉన్న అన్ని ఆటోల డ్రైవర్లు క్యూఆర్ కోడ్ తో కూడిన యూనిక్ నెంబర్ ను కలిగి ఉండాలని తెలిపారు. ఆటో డ్రైవర్లు బాధ్యతాయుతంగా వాహనాలు నడుపుతూ ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలని సూచించారు. ఖాకీ చొక్కా విధిగా ధరించడంతో పాటు లైసెన్స్ కలిగి ఉండాలని, వాహనానికి ఇన్సూరెన్స్ చేయించుకోవాలని సూచించారు. ప్రయాణికులతో సత్ప్రవర్తనతో మెదలాలని, ప్రమాదాల నివారణకు సహకరిస్తూ ప్రమాదరహిత ప్రాంతంగా తీర్చిదిద్దాలని సిఐ కోరారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

### టిక్కెట్ల కేటాయింపులో బిసిలకు బిఆర్ఎస్ మొండిచేయి

#### బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు డాక్టర్ రమేష్



కొమురంభీం ఆసిఫాబాద్, ఆగస్టు 21 (మనం న్యూస్): అసెంబ్లీ సీట్ల కేటాయింపులో బిఆర్ఎస్ పార్టీ బిసిలకు మొండిచేయి చూపించిందని బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు డాక్టర్ రూప్నర్ రమేష్ వ్యాఖ్యానించారు. జిల్లా కేంద్రంలోని బిసి సంక్షేమ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 60శాతమున్న బీసీలను పక్కకి పెట్టి 10శాతమున్న అగ్రవర్ణాలకు 50 శాతం సీట్లు కేటాయించడం ఏంటని ప్రశ్నించారు. వారిది భారతీయ రాష్ట్ర సమితి కాదని, భారతీయ రెడ్డి రావుల సమితి అన్నారు. ఈ రోజు విడుదల చేసిన లిస్టును రద్దు చేసి కొత్తగా 70 సీట్లు బీసీలకు కేటాయిస్తూ నూతన జాబితా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే బీసీలందరిని ఏకం చేసి బిఆర్ఎస్‌ను చిత్తుగా ఓడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాలి సంఘం జిల్లా అధ్యక్షుడు నాగోషే శంకర్ పటేల్, బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఆవిడపు ప్రణయ్ కుమార్, జిల్లా గౌరవ అధ్యక్షులు మారుతి, తేజపుర్ సర్పంచ్ సోమేశ్వర్, జిల్లా పటేల్ అధ్యక్షులు నారాయణ నాయకులు నగొరావు, గౌరయ్య, మొండి తదితరులు పాల్గొన్నారు.